


పేకాటతో సిపిఎంకు సంబంధం లేదు


సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో పేకాటస్థావరాలపై జరిగిన దాడిలో సిపిఎం నేత పట్టుబడ్డారని మీడియాలో వచ్చిన కథనాలు సత్య దూరమని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక రుగ్మతలైన దుర్వ్యసనాలకు తాము వ్యతిరేకమని వివరించారు. ఆదివారం నాడు మీడియాలో వెలువడిన ఒకట్రెండు కథనాల్లో కొన్ని పత్రికలు పొరపాటున తమ పార్టీ ప్రస్తావన తెచ్చినట్టు పత్రికా యాజమాన్యాలు తమకు తెలిపాయని, ఈ రకమైన వార్తా కథనాలు మంచిది కాదని తెలిపారు. తప్పుడు వార్తలు ప్రచురించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని వందవాసి నాగరాజు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మా 'గోడలకు స్టిక్కర్లు' అంటించకండి ప్లీజ్


- స్టిక్కర్లు అంటించే సంస్కృతికి స్వస్తి పలకండి
- రాష్ట్ర ముఖ్యమంత్రికి, జనసేన అధినేతకి, జిల్లా కలెక్టర్‌కి, ఎస్పీకి తిరుపతి నగర ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో నిన్నటి నుంచి 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ అధికార పార్టీ నాయకులు వీధులలో తిరుగుతూ ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించే వద్దని రాయలసీమ పోరాట సమితి నవీన్ కుమార్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వారికి పోటీగా జనసేన నాయకులు 'మాకు నమ్మకం లేదు జగన్ మాకు నమ్మకం పవన్' అని అదే స్టిక్కర్ కింద మరో స్టిక్కర్ అతికిస్తున్నారు. తిరుపతి నగరంలోని ఇంటి యజమానుల అనుమతి లేకుండా కొన్నిచోట్ల పోటీలు పడిమరీ ఇరు పార్టీలు స్టిక్కర్లు అతికించడం కారణంగా స్థానికులు నాయకులను నేరుగా ప్రశ్నించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.



తిరుపతి నగరంలోని ఓవ్యాపారి తన ఇంటికీ అతికించిన రెండు పార్టీల స్టిక్కర్లను తనకు పంపి అధికారులు దష్టికి తీసుకెళ్లండని ప్రాధేయపడటం శోచనీయం. తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో నిన్నటి నుంచి రెండు పార్టీలు పోటీలు పడి ఇంటి యజమానుల అనుమతి లేకుండా అక్కడక్కడ స్టిక్కర్లు అంటించారు. ఈ రెండు పార్టీలను ఆదర్శంగా తీసుకొని రేపు రాష్ట్రంలోని అన్నీ రాజకీయ పార్టీలు పోటీలు పడి తమ ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికిస్తే మేము ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు లోపలికి వచ్చేటప్పుడు చాలా అసౌకర్యంగా, ఇబ్బందికరంగా మారుతుందని మథనపడుతున్నారు. ఆ విషయాన్ని ఇరు పార్టీల నాయకులు గుర్తించాలి. ఏ అధికార పార్టీ అయినా ప్రజలు మెచ్చే విధంగా పది కాలాలపాటు నిలిచే విధంగా సంక్షేమ కార్యక్రమాలు చేస్తే గోడలకు స్టిక్కర్లు అంటించాల్సిన అవసరం లేదు. అలాగే ప్రతిపక్ష పార్టీలు ప్రజాసమస్యల మీద రాజీలేని పోరాటం చేస్తే పోటీగా స్టిక్కర్లు అంటించాల్సిన పనేలేదు. మంచి చేస్తే ప్రజలు కులమతాలకు అతీతంగా ఎప్పటికీ తమ గుండెల్లో సుస్థిరస్థానాన్ని కల్పిస్తారన్న సత్యాన్ని నాయకులు గుర్తించాలి.

తిరుపతి నగరానికి పరిశుభ్రత విషయంలో ఇటీవలే స్వచ్ఛ సర్వేక్షన్, క్లీన్ అండ్ గ్రీన్ అవార్డులు రావడం రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్లాస్టిక్‌బ్యాన్ అని ప్రకటించిన విషయాన్ని పాలకులు గుర్తించాలి. తిరుపతి నగర ప్రజల ఆవేదనను ఇరు పార్టీలు అర్థం చేసుకొని ఇంటి గోడలపై పోటీలు పడి స్టిక్కర్లు అంటించే సంస్కతికి స్వస్తి పలకాలని అధికారులు సైతం కట్టడి చేయాలని ఇప్పటికే ఇంటి గోడలపై అతికించిన స్టిక్కర్లను తొలగించాలని నగర ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నాను.



మా గోడలకు స్టిక్కర్లు అంటించవద్దని కోరుతున్న రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ పి.నవీన్ కుమార్ రెడ్డి

రోగి ఆరోగ్యం, వైద్యుల రక్షణే ఐఎంఎ ధ్యేయం

జాతీయ ఉపాధ్యక్షులు డాక్టరు దగ్గుమాటి శ్రీహరిరావు

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించడం, వైద్యం చేసే డాక్టర్లుకు రక్షణ కల్పించడం ఐఎంఏ ధ్యేయమని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు డాక్టరు దగ్గుమాటి శ్రీహరిరావు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయస్థాయిలో దక్షణ భారతదేశం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఏకైక వ్యక్తి డాక్టరు శ్రీహరిరావును తిరుపతి రెడ్డిఅండ్ రెడ్డి కాలనీలోని తన కార్యాలయంలో కలిసిన ప్రజాశక్తితో ఆయన పలు అంశాలను వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే.....

ప్రజాశక్తి: ఐఎంఏ ఎప్పుడు ఏర్పడింది, దానికి కారకులు ఎవ్వరు?

శ్రీహరిరావు: కలకత్తా కేంద్రంగా 19917లో ఆల్ ఇండియా మెడికల్ మొట్టమొదటి కాన్ఫెరెన్స్‌ను డాక్టరు బిసి రాయ్ కృషితో జరిగింది. 1918లో ఢిల్లీలో రెండోవది, 1919లో మూడోవది, 1920 నాగపూర్‌లో నాలుగోవ కాన్ఫెరెన్స్ జరిగింది. వీటిలో చర్చించిన మేరకు 1928 డిసెంబరు 28న కలకత్తా కేంద్రంగా జరిగిన ఐదోవ కాన్ఫెరెన్స్‌లో ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషణ్‌ను స్థాపించారు. తొలి అధ్యక్షులుగా ముంబాయికి చెందిన డాక్టరు జివి దేశముక్ ఎన్నికయ్యారు.

ప్రజాశక్తి: ఐఎంఏగా ఎప్పుడు మార్పు జరిగింది?

శ్రీహరిరావు: 1958 సెప్టెంబరు 19వ తేదీన ఢిల్లీ కేంద్రంగా ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఏఐఎంఏ)ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)గా మార్పు చేశారు. దీనికి దేశానికి తొలిరాష్ట్రపతి డాక్టరు బాబురాజేంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. ఈ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి 1964 సెప్టెంబరు 6న అప్పటి రాష్ట్రపతి డాక్టరు ఎస్.రాధాకృష్ణన్ చేతులు మీదగా ప్రారంభించారు.

ప్రజాశక్తి: దేశ వ్యాప్తంగా ఐఎంఏ సభ్యుల సంఖ్య..?

శ్రీహరిరావు: 20 నుంచి 25మంది సభ్యులతో ఏఐఎంఏను 1928లో స్థాపించారు. ఇది అంచెలంచెలుగా ఎదిగి, దేశవ్యాప్తంగా విస్తరించి, ఐఎంఏగా మార్పు చెందింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1750 బ్రాంచ్‌లతో 4లక్షల మంది సభ్యులతో దేశంలోనే అతిపెద్ద ఎన్‌జీవో సంస్థగా ఉంది.

ప్రజాశక్తి: ఐఎంఏ ఇప్పటి వరకు చేసిన సేవలు..?

శ్రీహరిరావు: ఐఎంఏ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వకు 14వేల గ్రామాలను దత్తతు తీసుకుని 20లక్షల మందికి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నాం. 165 బ్లడ్‌బ్యాంకుల ద్వారా 1,28,000 యూనిట్ల రక్తాన్ని 25వేల క్యాంపుల ద్వారా సేకరించాం. దేశంలో రక్తహీనత లేని ప్రజల ఉండాలని, క్షయవ్యాధిని 2025కు నిర్మూలించాలనే, లింగనిర్ధారణ చేసేవారిపై, మహిళలపై అరాచకాలను చేసేవారిపై చర్యలు తీసుకునేలా పోరాటాలు, వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం, వైద్యులకు ఇబ్బందికరంగా మారుతున్న జీవోలను సవరించాలని అనేక పోరాటాలు చేశాం.

ప్రజాశక్తి: ఐఎంఏలో ఏఏ విభాగాలు ఉన్నాయి..?

శ్రీహరిరావు: ఐఎంఏలో ప్రధానంగా ఏడు విభాగాలు పనిచేస్తున్నాయి. మెడికల్ స్టూడెంట్ నెట్‌వర్క్ (ఎంఎస్‌ఎన్), జూనియర్ డాక్టర్ల నెట్‌వర్క్ (జెడిఎన్), ఉమెన్స్ డాక్టర్ట్స్ వింగ్, ఏఎంఎస్, కాలేజి జనరల్ ప్రాకట్టీషర్స్ (సిజిఎఫ్), ప్రయివేట్ హాస్పిటల్స్‌కు సంబంధించి హాస్పిటల్ బోర్డు ఆప్ ఇండియా (హెచ్‌బిఐ), ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి సర్వీస్ డాక్టర్స్ వింగ్ ప్రదానంగా పని చేస్తున్నాయి, వీటితో పాటు ఉత్తరబారత రాష్ట్రాల్లో మరో నాలుగు వింగ్‌లు కూడా పని చేస్తున్నాయి.



ప్రజాశక్తి: ఐఎంఏలో సభ్యులకు ఏ స్కీమ్‌లు ఉన్నాయి..?

శ్రీహరిరావు: ఐఎంఏలో ఉన్న సభ్యుల సంక్షేమం కోసం అనేక స్కీమ్‌లు తీసుకొచ్చాం. ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ (సభ్యులు ఎవ్వరైనా చనిపోతే వారి కుటుంబానికి 6లక్షలు పరిహారం అందిస్తాం, ఇది గుంటూరు కేంద్రంగా పనిచేస్తోంది). అప్పారావు ఫ్యామిలీ సెక్యూరిటీ స్కీమ్ (సభ్యులు చనిపోతే వారి కుటుంబానికి 20లక్షల ఆర్థిక సహాయం అందిస్తాం, ఇది ఒంగోలు కేంద్రంగా పని చేస్తోంది), ఇది కాకుండా కేంద్రకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే స్కీమ్‌లో సభ్యులుగా చేరితే చనిపోయిన తర్వాత దీనికి అదనంగా మరో 30లక్షల రూపాయలు అందజేస్తాం. ప్రొఫెషనల్ ప్రొటెక్టీవ్ వెల్ఫేర్ స్కీమ్ (పిపిడబ్ల్యు కాకినాడ కేంద్రంగా పనిచేస్తోంది)

ప్రజాశక్తి: ప్రభుత్వంతో ఇటీవల మీరు చేసిన పోరు..?

శ్రీహరిరావు: కేంద్ర ప్రభుత్వం మార్చి 22వ తేదీ రైట్ టు హెల్త్ అనే చట్టం తీసుకొచ్చింది. దీన్ని వల్ల ప్రతి ఆసుపత్రిలో అత్యవసర వైద్యం ఉచితంగా అందజేయాలని, అవసరమైన డబ్బులు ప్రభుత్వం ఇస్తుందని, వంటి నిబంధనలతో రాజస్థాన్ ప్రభుత్వం జీవో తీసుకొచ్చింది. అక్కడ ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో అది మార్చి 27వ తేది అమల్లోకి తీసుకొచ్చారు. దీంతో పాటు మరికొన్ని రాష్ట్రాలు దీన్ని అనుచరించాయి. ఈ జీవోలో ఎలాంటి స్పష్టత లేదు. దీన్ని దేశవ్యాప్తంగా తాము వ్యతిరేకించాం. ఆందోళనలు ఉధృతం చేస్తాం, ప్రభుత్వం స్పందించింది. 50 పడకల లోపు ఆసుపత్రులకు అది వర్తించదు, ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన ఆసుపత్రులు తప్పనిసరిగా అమలు చేయాలి, ఏ జబ్బుకు ఎంత డబ్బులు అందజేస్తామో స్పష్టంగా తెలియజేసింది. ఏఫ్రిల్ 4వ తేదీ దీనికి సంబందించి కొత్త జీవోను విడుదల చేసింది. దీన్ని తాము ఆమోదించాం.

ప్రజాశక్తి: ఐఎంఏలో మీ ప్రస్థానం?

శ్రీహరిరావు: 1991లో తిరుపతి ఐఎంఏ సభ్యులుగా చేరాను, 1997లో నగర సంయుక్త కార్యదర్శిగా తర్వాత కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా, అధ్యక్షులుగా పనిచేశాను. అనంతరం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా అధ్యక్షులుగా, జాతీయస్థాయిలో ఎఫ్‌బిఎస్ చైర్మన్‌గా, రాష్ట్రస్థాయిలో అప్నా రాష్ట్ర అధ్యక్షులుగా, మెడికల్ కౌన్సిల్ మెంబర్‌గా పనిచేశాను. ఏకకాలంలో అప్నా రాష్ట్ర అధ్యక్షులుగా, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులుగా, ఏపి మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా పనిచేశాను. ఈ ఘనత సాధించిన మొదటి వ్యక్తి నేనే కావడం సంతోషకరం. తర్వాత ఎఫ్‌బిఎస్ ఛైర్మన్‌గా, జాతీయ స్థాయిలో ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఏకైక వ్యక్తి కూడా తానే కావడం మరింత బాధ్యతను పెంచింది.

ప్రజాశక్తి: రాష్ట్ర అధ్యక్షులుగా మీరు సాధించింది?

శ్రీహరిరావు: తాను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ చొరవతో 2.11,2008లో వైద్యులకు భద్రత చట్టం తీసుకొచ్చాం. రెవెన్యూ రికవరీ యాక్టు కింద నాన్‌బెయిల్‌బుల్ తీసుకొచ్చాం, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ యాక్టు (తప్ప చేసిన వారికి ఏడు సంవ్సరాలు జైలు శిక్ష, ఈ కమిటీకి జిల్లా కలెక్టరు చైర్మన్‌గా ఉంటారు), దీన్ని తాము వ్యతిరేకించా జైలు శిక్ష లేకుండా రూ.30వేల జరిమానాకు కుదించాలని, కమిటీ చైర్మన్‌గా వైద్యులు పరిస్థితులపై అవగాహన ఉన్న డిఎంహెచ్‌వోను ఏర్పాటు చేయాలని పోరాడి, సాధించాం. దీనికి మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టరు సిపాయి సుబ్రమణ్యం సహకారం చాలా ఉంది. అప్నా అధ్యక్షులుగా రాష్ట్రంలో సభ్యుల సంఖ్యను పెంచాం, ఐఎంఏ గెస్ట్‌హౌస్‌ను తిరుపతిలో నిర్మించాం.

ప్రజాశక్తి: ప్రస్తుత డిమాండ్లు?

శ్రీహరిరావు: సింగిల్‌విండో పర్మిషన్ ఇవ్వాలి, ఆసుపత్రులు నెలకొల్పేవారికి రెవెన్యూ పర్మిషన్, ఫైర్ ఫర్మిషన్, పోలీసుల పర్మిషన్ ఇలా అనేక పర్మిషన్లు కాకుండా అన్ని కలిసి ఒకే పర్మిషన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కింద వేస్టేజ్ మేనేజ్‌మెంట్ పేరుతో బెడ్డుకు రోజుకు రూ.8లు చొప్పను వసూళ్లు చేస్తున్నారు. అది ఫుల్ అయినా కాకపోయినా, దీన్ని సవరించి నెలకు సరాసరి కిందైన, లేక వేస్టేజ్ వెయిట్ బట్టి పన్ను వసూళ్లు చేయాలి. సిపిఏ యాక్టు స్థానంలో ఎక్స్‌ఫర్టుతో ట్రిబ్యునల్ కమిటీ ఏర్పాటు చేయాలి. సెంట్రల్ వైలెన్స్ యాక్టును రద్దు చేయాలి. ఎంబిబిఎస్ తర్వాత పిజి కోసం గతంలో నీట్ ఉండేది, దీన్ని కేంద్ర ప్రభుత్వం నెక్స్ట్ పేరుతో కొత్త పరీక్షను తీసుకొచ్చింది. దీని ద్వారా ఎంబిబిఎస్ పాస్, పిజి సీట్, ఉద్యోగం కోసం అన్ని ఈ పరీక్షతోనే జరిగేలా జీవో తీసుకొచ్చారు. ఇది సరైనది కాదు, ఎంబిబిఎస్ తర్వాత పిజికి ప్రశేష పరీక్ష పెట్టాలి, ఉద్యోగానికి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ, ఎగ్జామ్ పెట్టాలన్నది మా డిమాండు. దీనిపై కేంద్రం ఎందుకో మెతకవైఖరి అవలంభిస్తోంది. దీన్ని పరిష్కరించాలని పోరాటాలు చేస్తాం.



శ్రీ పద్మావతి అమ్మవారిసేవలో ఆర్థికశాఖ మంత్రి

ప్రజాశక్తి- తిరుచానూరు: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం ఉదయం రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌తో కలిసి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారి కుంకుమసేవలో పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు. వారికి ఆర్డీవో కనక నరసారెడ్డి, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏవిఎస్వో శైలేంద్ర బాబు, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆగమ సలహాదారు శ్రీనివాస్చార్యులు, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, అశోక్ ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్విమ్స్‌లో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: స్విమ్స్ సిటి సర్జరీ విభాగం ఆధ్వర్యంలో హాండ్స్ ఆఫ్ వాస్కులర్ అనాస్తోమోసిస్ వర్క్‌షాపును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టరు డాక్టరు వెంగమ్మ మాట్లాడుతూ వాస్కులర్ అనస్టోమోషన్ అనేది రెండు రక్తనాళాలు ఒకదానికొకటి అనుసంధానించబడి, పునరుద్దరించబడిన శస్త్రచికిత్స ప్రక్రియ. ఇది నిరోధించబడిన, దెబ్బతిన్న నాళంలో రక్తప్రవాహాన్ని మెరుగుపరచడానికి, రక్తగాయాలను సరిచేయడానికి, రెండు నాళాల మధ్య బైపాస్‌ను రూపొందించడానికి నిర్వహిస్తారన్నారు. ఈ ప్రక్రియ సమయంలో సర్జన్ జాగ్రత్తగా కుట్లు, స్టేపుల్స్, ఇతర పదార్థాలను ఉపయోగించిచ రెండు నాళాలను కలుపుతారు, కనెక్షన్ ఎటువంటి లీక్‌లు లేకుండా సురక్షితంగా ఉండేలా చూస్తారు. ఈప్రక్రియ సాధారణంగా కరోనరి అర్టరీ బైపాస్‌గ్రాఫ్టింగ్, హీమోడయాలసిస్ కోసం వాస్కులర్ యాక్సిస్, అవయవ మార్పిడి వంటి వాస్కులర్ సర్జరీలలో ఉపయోగడపతుందని అన్నారు. ప్రక్రియ విజయం, సర్జన్ నైపుణ్యం, అనుభవం, రోగి ఆరోగ్యం, నాళాలను కనెక్ట్ చేయడానికి ఉపయోగించే పదార్థాల నాణ్యతపై ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం డాక్టరు వాసుదేవరెడ్డి బేసిక్స్ ఆప్ వాస్కులర్ అనాటమీ, డాక్టరు సత్యవతి ప్రిన్సిపుల్స్ ఆప్ వాస్కులర్ ట్రక్షన్, డాక్టరు సెంథిల్ కుమార్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆప్ వాస్కులర్ ఇంజరిస్, డాక్టరు అమితావిక్రమా బేసిక్స్ ఆఫ్ ఎండో వాస్కులర్ ఇంటర్వెన్షన్స్, డాక్టరు వినోద్‌బాను ప్రిన్సిపుల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ అరటీరియల్ డిజీసెస్, డాక్టరు శివశంకర్ ఫార్మకో థెరపి ఇన్ వాస్కులర్ డిసిజెస్ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో డాక్టరు శ్రీకాంత్, డాక్టరు శ్రీహరిరావు, వైద్యులు, సిటి.సర్జరీ విభాగపు వైద్యులు నవీన్, కీర్తీక, పిజి వైద్యులు, ఎంబిబిఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్‌కి అందుబాటులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: టిటిడి నిర్మిస్తున్న చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని డిసెంబర్ నాటికి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. టిటిడి ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఇతర అధికారులతో కలిసి ఆదివారం ఆయన అలిపిరి వద్ద నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను, టిటిడి గోశాలలోని ఫిడ్ మిక్సింగ్ ప్లాంట్, ఆగర బత్తీల తయారీ రెండోవ యూనిట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ నిర్మాణం వల్ల గోశాలలోని గోమాతలు, ఇతర పశువులలకు బలవర్థకమైన సమగ్ర దాణా అందించే అవకాశం కల్గిందని అన్నారు. తద్వారా పాలఉత్పత్తి పెరగడంతో పాటు, పాలల్లో ప్రోటీన్ శాతం కూడా గణనీయంగా వృద్ధి చెందుతుందని అన్నారు. టిటిడి ఆలయాల్లో ఉపయోగించిన పువ్వులతో తయారు చేస్తున్న ఆగర బత్తీలకు బక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా టిటిడి రెండోవ యూనిట్‌ను ప్రారంభించడాన్ని ఆయన అభినందించారు. శ్రీపద్మావతి హృదయాలంలో 1300కు పైగా చిన్నపిల్లలకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ ఆసుపత్రిలో ఇటీవల రెండు మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించిన ఆసుపత్రి డైరెక్టరు డాక్టరు శ్రీనాథ్‌రెడ్డి, ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, స్విమ్స్ క్యాన్సర్ ఆసుపత్రి, తిరుమలలో అంజనాద్రి అభివృద్ధిని సమీక్ష జరిపారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ బృందావనం పనులు, శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ప్రగతి, ఉద్యోగులకు ఇల్లస్థలాలు పంపిణీ, ఈహెచ్ఎస్ ట్రస్ట్, బర్డ్ ఆసుపత్రిలో కాక్లియర్ ఇంప్లాంట్, గ్రహణ మొర్రి సర్జరీలు నిర్వహిస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. టిటిడి విద్యాసంస్థల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. తిరుపతిలోని అన్ని కళాశాలలో హాస్టళ్లకు సెంట్రలైజ్డ్ కిచెన్‌ఏర్పాటు చేసి అంశంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సిఈవో విజయ్ కుమార్, జిల్లా కలెక్టరు వెంకట రమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజీ, టిటిడి చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, స్విమ్స్ డైరెక్టరు డాక్టరు వెంగమ్మ, డాక్టరు శ్రీనాథరెడ్డి, డాక్టరు రెడ్డెప్పరెడ్డి, డాక్టరు రవి, డాక్టరు హరినాథరెడ్డి, రామసునీల్‌రెడ్డి పాల్గొన్నారు.



చిన్నపిల్లల ఆసుపత్రి గురించి అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్ రెడ్డి

శ్రీవారు, అమ్మవార్లకు బంగారు చీరలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తెలంగాణ రాష్ట్రం సిరిసిల్లకు చెందని నల్ల విజయ్ తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామికి, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి అగ్గిపెట్టలో పట్టే బంగారు చీరలను బహుకరించారు. తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టరు కెఎస్.జవహర్‌రెడ్డి చేతులు మీదగా వీటిని అందించారు. స్వామివారికి రూ.45వేల విలువ చేసే బంగారు చీరను, అగ్గిపెట్టెలో పట్టేలా ఆయన తయారు చేయించారు. శ్రీపద్మావతి అమ్మవారికి అగ్గిపెట్టెలో పట్టేలా 5గ్రాముల బంగారుతో జరీ చీరను తయారు చేయించి ఇచ్చారు. ఈసందర్భంగా దాతను ఆయన అభినందించారు.



అక్రమ మైనింగ్ చేస్తున్న లారీలు సీజ్



అధికారులు సీజ్ చేసిన లారీ

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలోని చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 195/2లో ఎ12.37సె ఎకరాలు, 195/4లో ఎ28.82సె మొత్తం ఎ41.19సె భూమిని సేకరించి జగనన్న ఇంటి స్థలాలు కోసం లేఅవుట్ డిజైనింగ్ చేసి సర్వే రాళ్లను సైతం రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. తర్వాత సర్వే ట్రైనింగ్ అకాడమీ కోసం ఈ భూమిని కేటాయిస్తూ క్యాబినెట్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం సర్వే ట్రైనింగ్ అకాడమీ కోసం కేటాయించిన భూమిలో ఎవరు ప్రవేశించరాదని తిరుపతి అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఈ బోర్డు ఏర్పాటుచేసిన కూతవేటు దూరంలోనే అక్రమ మైనింగ్‌కు కొందరు తెరలేపారు. పైగా కేవలం రాత్రుళ్ళు మాత్రమే సర్వే ట్రైనింగ్ అకాడమీ భూమిలో తవ్వకాలు జరిపి సమీపంలో ఏర్పాటు చేయబోతున్న వెంచర్లకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్వే ట్రైనింగ్ అకాడమీ భూమిలో అక్రమంగా మైనింగ్ చేస్తున్నడంతో జిల్లా మైనింగ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి శనివారం రాత్రి రెండు (ఎపి16 టీఎఫ్ 8939, ఎపి39 యూజీ 0459) నెంబర్లు గల టిప్పర్లను సీజ్ చేసి మంగళంలోని అలిపిరి పోలీస్ ఔట్ పోస్ట్ పోస్టుకు తరలించారు.

వందే భారత్ రైలులో జవహర్ రెడ్డి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి పర్యటన కోసం తిరుపతికి విచ్చేశారు. ఆదివారం ఆయన ఉదయం పదకొండు గంటలకు విమానంలో విజయవాడకు వెళ్లాల్సి ఉండగా, తిరుపతిలో పలు అభివద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ఆలస్యం కావడంతో ఆదివారం మధ్యాహ్నం తిరుపతి రైల్వే స్టేషన్లో మూడు గంటల 15 నిమిషాలకు వందే భారత్ రైల్లో గుంటూరుకు వెళ్లారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో టీటీడీ ఉన్నత అధికారులు జవహర్ రెడ్డికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి సికింద్రాబాద్ మధ్య ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వందే భారత్ ఎక్స్ప్రెస్ రైలు ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ రైలు తిరుపతి వాసులకు సౌకర్యంగా ఉందని పేర్కొన్నారు.

తిరుపతి నుంచి వందే భారత్ పయనం

తిరుపతి నుంచి సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్ప్రెస్ రైలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల 15 నిమిషాలకు బయలు దేరింది. ఈ రైలు బయలుదేరే ముందు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి టీటీడీ ఈవో ధర్మారెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జెసి డీకే బాలాజీ, కమిషనర్ హరిత, జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ జెండా ఊపి రైలు పంపించారు. వందే భారత రైలు చూడడానికి తిరుపతి నుంచి భారీ సంఖ్యలో రైల్వే స్టేషన్‌కి తరలివచ్చారు. వీరితో పాటు ప్రయాణికులు అధికారులు ఉన్నతాధికారులు తరలివచ్చారు.

14 నుంచి 31వరకు జరగబోయే..

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరుటౌన్: బిజెపి కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఎండగట్టేందుకు ప్రజలు సంసిద్ధం కావాలని, బిజెపి ప్రభుత్వం పూర్తిగా ప్రజావ్యతిరేక విధానాలను చట్టాలుగా తీసుకురావడానికి సిపిఐ, సిపిఎంలు సంయుక్తంగా వ్యతిరేకిస్తూ ఈనెల 14 నుంచి 31వరకు జరగబోయే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్, సిపిఎం కార్యదర్శి జోగి శివయ్య మాట్లాడుతూ ఆర్థిక విధానాలు, అధిక ధరలు, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, జీఎస్టీతో భారాలు, మతోన్మాదం, వంటివాటిపై బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. సీపీఐ నాయకులు, కాలేషా బాయ్, రమేష్, చంద్రయ్య, సీపీఎం నాయకులు రమణయ్య, ప్రసాద్, ముత్యాలయ్య, సురేష్, గోపి, నాయకులు పాల్గొన్నారు.



ఎస్వీయూలో డ్రైనేజీ కష్టాలు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిసర హాస్టళ్ల ప్రాంతాలలో డ్రైనేజీ సమస్యలతో విద్యార్థులు గత నెల రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంతోమంది విద్యార్థి సంఘ నేతలు, విద్యార్థులు, హాస్టల్ అధికారులకు విన్నవించినా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడంపై వర్సిటీలో తీవ్రల అసంతృప్తి నెలకొంది. ముఖ్యంగా బాలికల హాస్టల్ ప్రవేశ ద్వారం ఎదుట గత వారం రోజులకు పైగా డ్రైనేజీ రహదారిలో పారడంతో నడిచేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వర్సిటీలోని ఆంధ్రా బ్యాంక్ ఎదురుగా వర్సిటీ అధికారుల నివాస ప్రాంతాలపై పక్కన డ్రైనేజీ వాటర్ ఎక్కువగా నిలువ ఉండటంతో సాధారణమైన పందులు, అడవి పందులు డ్రైనేజీలో పొర్లాడుతూ తీవ్ర ఇబ్బంది కలిగిస్తూ అక్కడ బాలికల హాస్టళ్లకు, అటువైపు నివాసం ఉండే వర్సిటీ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. అక్కడే నివసించే ఉద్యోగులకు తాగునీటి సౌకర్యం కల్పించమని ఎంత విన్నవించుకున్నా అధికారులు పట్టించుకున్న పాపాన లేదే. బాలుర వసతి గహమైన డి బ్లాక్ పక్కన ఉన్న డ్రైనేజీ ఉప్పొంగుతూ విద్యార్థులకు, రహదారి చోదకులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుంది. వర్సిటీ లోని పలు ప్రాంతాలలో డ్రైనేజీ పైపులు ఇప్పటికీ పూర్తి చేయకపోవడంపై ఇంజినీరింగ్ అధికారుల అసమర్థత, పనిలో నిర్లక్ష్యం స్పష్టంగా వెల్లడవుతున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు మేల్కొని డ్రైనేజీ సమస్యలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఆక్వా రైతులకు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి



ప్రజాశక్తి-వాకాడు: చిట్టమూరు విద్యుత్ శాఖ ఉప కార్యాలయం ఎదుట విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో ఆక్వా రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ గణపతి కిషోర్‌నాయుడు మాట్లాడుతూ వెంటనే విద్యుత్తు ఛార్జీలు తగ్గించకుంటే ప్రజలే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు కస్తూరయ్య, మండల టీడీపీ కార్యదర్శి చిన్నారావు, సుబ్రహ్మణ్యం, అరవపాలెం సర్పంచ్ రాజేష్‌రెడ్డి, ఆరూరు సర్పంచ్ ఏడుకొండలు, దేవుడు, చిట్టమూరు సర్పంచ్ కోటయ్య, మండల నాయకులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని బాల సదన్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతన వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను క్లబ్ సభ్యులు దాత శ్రీనివాసాచారి ప్రారంభించారు. అనంతరం ఫుడ్ ఛాయిస్ కార్యక్రమంలో చిన్నారులకు కోరిన ఆహార పదార్థాలను అందించారు. క్లబ్ సీనియర్ సభ్యులు దశరథ రామి రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సమాజంలో పేద వారికి సహాయం చేసేందుకు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు మయూరి శ్యామ్ యాదవ్, ముని గిరీష్, శ్రీధర్‌రెడ్డి, రవి కుమార్, జి.జి.నాయుడు, రామ్‌ప్రసాద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి-క్యాంపస్: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని ప్రకాశం భవన్ ఎదుట ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెన్నే మల్లికార్జున, తిరుపతి అధ్యక్షులు షేక్ జావిద్ మాట్లాడుతూ 52 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో , అన్ని యూనివర్సిటీలలోఎన్నో రాజీ లేని పోరాటలు చేసి విద్యార్థుల కు స్కాలర్ షిప్పులు, ఫీజు రీఎంబర్స్‌మెంట్, నిరుద్యోగుల తరపున ఉద్యోగాల కల్పనకై పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో బాలు, హరీష్, మూర్తి, అశోక్, వెంకట్, రామాంజనేయులు, మంజు, వీరాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ అకృత్యాలకు నిరసనగా 11న చలో విజయవాడ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : దళితులపై వైసిపి దాడులు నిరసిస్తూ ఈనెల 11న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి మహేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దళితులు, మైనార్టీలపై హత్యాకాండ కొనసాగుతుందని.. ఈ అకత్యాలను నిరసిస్తూ చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమేష్, పురుషోత్తం, సిపిఐ నాయకులు గోపి, సెల్వరాజ్ ఆచారి, దినేష్, దళిత నాయకులు పాల్గొన్నారు.

వనితకు భరోసా.. మహిళా సమ్మాన్


- తపాలాలో పెట్టుబడులతో ఆర్థికాభివృద్ధి
- తక్కువ కాలవ్యవధిలో అధిక వడ్డీ
- మూడు నెలలకోసారి ఖాతాలో జమ
- ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే పథకం ప్రారంభం

'మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన పథకం' ఓ స్వల్పకాలిక పథకం. ఇందులో మీ డబ్బును రెండేళ్ల పాటు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ పథకం 01 ఏప్రిల్ 2023 నుంచి తపాలా శాఖలో ప్రారంభమైంది. ఇందులో వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం వడ్డీ లభిస్తుంది. ఈ పథకం ఎఫ్‌డీ లాంటిది. తక్కువ కాల వ్యవధి పెట్టుబడిపై వడ్డీని పొందవచ్చు. దీంతోపాటు ఈ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టడానికి ఎటువంటి వయోపరిమితిని నిర్ణయించలేదు. ఏ వయస్సులో ఉన్న బాలికలు, మహిళలైనా ఇందులో పెట్టుబడి పెట్టొచ్చు. పథకం మధ్యలో డబ్బు అవసరమైతే పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంటుంది.

ప్రజాశక్తి - బాలాయపల్లి

మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో పోస్టల్‌శాఖ చిన్న మొత్తాల పొదుపు పథకాలు ప్రవేశపెట్టింది. 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనల్లో మహిళలకు ప్రయోజనం చేకూర్చేందుకు మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన స్కీమ్ కోసం పోస్టాఫీసులో ఖాతా తెరవొచ్చు. ఇది చిన్న మొత్తాల పొదుపు పథకం. ఆజాదీకా అమత్ మహోత్సవంలో భాగంగా మహిళలు, బాలికల కోసం ప్రత్యేకంగా కొత్త చిన్న మొత్తాల పొదుపు పథకాన్ని 2023-24 బడ్జెట్ కేటాయించి మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం, బ్యాంకు ఎఫ్‌డీ ప్రవేశపెట్టింది. ఈ పథకాలు రెండేళ్లపాటు అందుబాటులోఉంటాయి. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్లు పథకం, బ్యాంకు ఎఫ్‌డీ ఈ రెండింటిలో ఎక్కువ ప్రయోజనం లభిస్తుందో చూద్దాం.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ లాభం ఈ పథకంలో కేవలం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్లను మహిళలు, బాలికల పేరుపై మాత్రమే తీసుకోవాలి. ఈ పథకంలో రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. దీని కాలపరిమితి రెండేళ్లు ఉంటుంది. 2023 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు అందుబాటులో ఉంటుంది. ఈ పథకానికి 7.50 శాతం స్థిర వడ్డీ రేటును ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం చిన్న మొత్తాల పొదుపు పథకాలలో బాలికల కోసం ఉద్దేశించిన సుకన్య సమద్ధి



యోజన పథకానికి 7.60 శాతం, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ కోసం 8 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. ఈ రెండు పథకాల తర్వాత అధిక వడ్డీ రేటు ఇస్తున్న పథకం ఇదే కావడం విశేషం.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ ఎలా చేయాలి

ఈ పథకం 2023 ఏప్రిల్ 1 నుంచి అందుబాటులోకి వచ్చింది. సమీపంలోని బ్యాంక్, పోస్టాఫీసును సందర్శించి మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన ఫారంను తీసుకోవాలి. వ్యక్తిగత, ఆర్థిక వివరాలను అందించి దరఖాస్తు పూర్తి చేయాలి. చిరునామా రుజువు కోసం అవసరమైన పత్రాలను దరఖాస్తు ఫారంతో పాటు సమర్పించాలి. డిపాజిట్ మొత్తాన్ని ఎంచుకుని, నగదు రూపంలోనూ, చెక్కు రూపంలోనైనా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. పెట్టుబడికి రుజువుగా సర్టిఫికెట్‌ను ఇస్తారు. దీన్ని తీసుకోవాలి.

సుకన్య సమృద్ధి యోజన పథకం

సుకన్య సమృద్ధి యోజన అనేది దీర్ఘకాలిక పెట్టుబడి పథకం. ఇందులో ఆడపిల్లల కోసం మాత్రమే పెట్టుబడి పెట్టాలి. ఈ పథకం కింద, సుకన్య సమద్ధి యోజన ఖాతాలో జమ చేసిన మొత్తంపై 7.6 శాతం వడ్డీని కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇందులో ప్రతి సంవత్సరం కనీసం రూ. 250 నుంచి గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఆడపిల్లకు 18 సంవత్స రాలు నిండిన తర్వాత, ఆ ఖాతా నుంచి పాక్షికంగా విత్‌డ్రా చేసుకునే సదుపాయాన్ని ఆమె పొందుతుంది. 21 సంవత్సరాల వయస్సు నిండిన తర్వాత మొత్తం డబ్బును వెనక్కు తీసుకోవచ్చు.

ఎంత వడ్డీ వస్తుంది

రెండేళ్ల పాటు ఈ పథకం గరిష్ట పరిమితి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెడితే.. ఏడాదికి 7.50 శాతం వడ్డీ చొప్పున మొదటి సంవత్సరంలో రూ.15 వేలు, రెండో సంవత్సరంలో రూ.16,125, మొత్తంగా రూ.31,125 వడ్డీ పొందొచ్చు. సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ విస్ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ భారత దేశంలో అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్. బి. ఐ). ప్రస్తుతం రెండేళ్ల కాల పరిమితి గల ఎఫ్‌డీలపై 6.75 శాతం వడ్డీ ఇస్తోంది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, కోటక్ మహీంద్రా వంటి కొన్ని బ్యాంకులు ఇదే కాలపరిమితి గల డిపాజిట్లపై 7 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. అంటే కొన్ని పెద్ద బ్యాంకులు ఎఫ్‌డీపై అందించే వడ్డీ రేటు కంటే మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ 0.50 శాతం నుంచి 1 శాతం ఎక్కువ వడ్డీనే అందిస్తోంది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్ వంటి కొన్ని బ్యాంకులు రెండేళ్ల కాలపరిమితి గల డిపాజిట్లపై 7.50 శాతం వడ్డీ ఆఫర్ చేస్తుండగా కొన్ని స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 8 శాతం వడ్డీని కూడా ఆఫర్ చేస్తున్నాయి.

మహిళలకు మాత్రమే



తపాలా శాఖలో ప్రత్యేకంగా మహిళల పెట్టుబడిలో భాగస్వామ్యాన్ని పెంచడానికి, ఆర్థికంగా బలోపేతం చేయడానికి చిన్న మొత్తాలా పొదుపు పథకం కింద పోస్ట్ ఆఫీస్ ద్వారా 2023 ఏప్రిల్ 1 వ తేదీ నుంచి మహిళా సమ్మాన్ సేవింగ్ పథకం ప్రవేశపెట్టింది. మహిళలు మాత్రమే ఈ పథకంతో తక్కువ సమయంలో ఎక్కువ రాబడి పొందేలా సంవత్సరానికి 7.5 శాతం వడ్డీని ఇవ్వనుంది. ఇందులో కనీసం రూ.1000 నుండి గరిష్టంగా రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చు. ఒక అకౌంట్ ఓపెన్ చేసిన తరువాత, మూడు నెలల తరువాత మళ్లీ అకౌంట్ ఓపెన్ చేసుకునే అవకాశం కలదు. ఈ పథకం కాలపరిమితి రెండు సంవత్సరాలు మాత్రమే. పథకం కింద వడ్డీని ప్రతి మూడు నెలలకి ఒకసారి ఖాతాలో జమచేయబడును. వివరాల కోసం దగ్గరలోని పోస్ట్ ఆఫీస్‌ని సంప్రదించండి.

- బి.మణికండన్, తపాలా ఇన్‌స్పెక్టర్, శ్రీకాళహస్తి

'చంద్రగిరిలో కార్యకర్తలే నా కుటుంబం'



ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: చంద్రగిరి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలే నా కుటుంబమని.. సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి అందరి ముందుకొస్తున్నానని.. ఇప్పుడు నాయకులు, కార్యకర్తలతో ఎలా ఉన్నానో అధికారంలోకి వచ్చినా అలాగే ఉంటానని నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాని అన్నారు. ఆదివారం తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల12 నుంచి 'మీ ఇంటికి మీ నాని' కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. నామినేటెడ్ పదవుల్లో గాని.. ఇతర పదవుల్లో గాని తన భార్య, కుమారుడు, కోడలు జోక్యం ఉండదన్నారు. కేవలం ముఖ్యమైన కార్యక్రమాలు, ప్రచారంలో మాత్రమే పాల్గొంటారని తెలిపారు. ప్రతిఒక్కరికీ న్యాయం చేసేలా పని చేస్తానన్నారు. అందరూ కలిసికట్టుగా 2024లో చంద్రగిరి కోటపై టీడీపీ జెండా ఎగరేద్దామని తెలిపారు. 'మీ ఇంటికి మీ నాని' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. టిడిపి జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పని అయిపోయిందని.. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని తెలిపారు. చంద్రగిరిలో పులివర్తి నానిని గెలిపించే బాధ్యత ప్రతిఒక్క టీడీపీ కార్యకర్తపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పరసరత్నం, మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే అందరికీ సమన్యాయం





ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వైసీపీ మండలాధ్యక్షులు ఆరని విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పుత్తేరి సచివాలయం పరిధిలోని పీవీ కండ్రి పంచాయతీ ఏ పార్లపల్లి గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు, వాలంటీర్లు కలిసి ప్రజల్లోకి వెళుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆలత్తూరు ఎంపీటీసీ కోకిల, వరలక్ష్మి, సచివాలయం కన్వీనర్ రమేష్, భాస్కర్ రెడ్డి, తులసీరామ్, అజయ్‌కుమార్‌రెడ్డి, పుట్టయ్య, వీరాస్వామి, మనోహర్, రవి, లక్ష్మీనారాయణ, రమణయ్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

కోట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజల్లో ఓ నమ్మకం ఏర్పడిందని రానున్న 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని ఎంపీటీసీ షేక్ మొబీన్‌బాషా అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం తిన్నెలపూడి సచివాలయం పరిధిలో 'నా నమ్మకం.. నువ్వే జగన్' కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు గహ సారథులతో కలిసి ముమ్మరంగా ఇంటింటికీ వెళ్లి కుటుంబాలను కలిసి వైసీపీ రాష్ట్ర ప్రభుత్వం గురించి వివరించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కనుపూరు జగదీష్, వైసీపీ మహిళా నాయకురాలు సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని 25వ వార్డు, 19వ సచివాలయం పరిధిలో స్థానిక శాసన మండలి సభ్యులు మేరిగ మురళి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పోణకా దేవసేనమ్మ ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ బాలిబోయిన రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలపై ప్రజల స్పందన తెలుసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, గహసారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నాయుడుపేట: సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆదేశాల మేరకు ఆదివారం భరత్ నగర్ సచివాలయం 2వ వార్డు లో కౌన్సిలర్ పాలేటి నాగార్జున ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటి గడపగడపకు వెళ్లి ప్రభుత్వం పనితీరు.. పథకాలపై వివరించారు. కన్వీనర్ ముత్యాలరెడ్డి, గహసారథులు కంజర్ల శంకర్రావు, కీర్తిపాటి పావని, వాలంటీర్లు సాయి కష్ణ, వేముల జ్యోతి, గంగాధర్ పాల్గొన్నారు.

బీజేపీ హటావోను జయప్రదం చేయండి





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈనెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు దేశవ్యాప్తంగా చేపడుతున్న బిజెపి హటావో - భారత్ బచావో కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టాక దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఎలా పతనావస్థకు చేరుకున్నాయో, కార్పొరేట్ శక్తులు ప్రపంచ స్థాయికి చేరుకున్నారో ఈ సందర్భంగా మురళి వివరించారు. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి దేశంలో మోడీ సాగిస్తున్న దౌర్జన్యకాండను బిజెపి హటావో భారత్ బచావో కార్యక్రమంతో ప్రజల మధ్యనే ఎండగట్టాలని పిలుపునిచ్చారు. డేగా ప్రభాకర్, జనమాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: సీపీఐ, సీపీఎం పాదయాత్రలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కుమార్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సమితి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా మోడీ హటావో దేశ్ కో బచావో అనే నినాదంతో ఏప్రిల్ 14 నుండి 30వ తేదీ వరకు సిపిఐ, సిపిఎం పార్టీలు పాదయాత్రలతో ప్రచార సమరభేరి జరుపుతున్నాయని తెలిపారు. పిచ్చాటూరు సిపిఐ మండల కార్యదర్శి ఎం విజయ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు చంద్రబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కత్తి ధర్మయ్య, యువజన విద్యార్థి సంఘ నాయకులు తరుణ్ కుమార్, చంద్ర, నాగార్జున పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో పార్థసారథి



ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కుటుంబ సమేతంగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రచయిత్రి ఉషారాణికి వరల్డ్ బుక్ అవార్డు



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేటకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, ఉషోదయ సాహితీ వేదిక అధ్యక్షులు, రచయిత్రి ధనాశి ఉషారాణి 'వరల్డ్ బుక్ రికార్డు ' అవార్డు అందుకొన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ తెలుగు బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో అవార్డుతో సత్కరించారు. ఉపాధ్యాయులు, రచయితలు, స్థానికులు అభినందించారు.

కరపత్రాల ఆవిష్కరణ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132 జయంతి మహోత్సవాలను జయప్రదం చేయాలేని అంబేద్కర్ ట్రస్ట్ భవన్ ఛైర్మన్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ఆదివారం పుత్తూరులో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ భవన్లో 14వ తేదీన ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి అపరంజి, కోశాధికారి కుప్పయ్య , విజయ్ కుమార్, రాజేంద్ర, మహేష్, సంపత్, వేణుగోపాల్, రాజేంద్ర, ఏలుమలై, గుణశేఖర్, కైలాసం ధనపాల్, సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనులకు తాగునీటి వసతి

- ప్రజాశక్తి వార్తకు స్పందన



ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని నిడిగల్లు గ్రామంలోని గిరిజన కాలనీలో గిరిజనులు గత మూడేళ్ల నుంచి తాగునీటికి అవస్థలు పడుతున్నారు. దీంతో గొంతెండుతోంది.. శీర్షికన గత రెండు రోజుల క్రితం ప్రజాశక్తిలో వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో స్వరూప రాణి కాలనీలోని తాగునీటి చేతిపంపునకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మినీ మంచినీటి పథకంతో కుళాయిలు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఏఈకి సూచించారు. గిరిజనులు ఎంపీడీవోకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ట్యాంకర్ బోల్తా పడి వ్యక్తి మృతి



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాల సమీపంలోని మామిడి తోటలో మందులు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు మందుల ట్యాంకర్ బోల్తా పడింది. ప్రమాదంలో ట్యాంకర్‌పై నుంచి సుబ్రహ్మణ్యం (47) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా.. రామ్మూర్తి (47) అనే వ్యక్తికి రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి విషయం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు సహాయ చర్యలు చేపట్టి గాయపడ్డ వారిని తిరుపతి రుయా హాస్పిటల్ కి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ తులసీరామ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీటీసీ రాజేశ్వరికి మాతృ వియోగం

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట సిపిఎం పార్టీ ఎంపీటీసీ సభ్యురాలు ఎస్. రాజేశ్వరి తల్లి కోలా జ్ఞానమ్మ (75) తిరుపతిలోని టి.కె. లేఅవుట్లో తన స్వగహంలో అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆమెకు రేణిగుంట సిపిఎం పార్టీ మండల నాయకులు, తిరుపతి జిల్లా నాయకులు, మహిళా సంఘం నాయకులు నివాళులు అర్పించారు.

జేఎల్ఎంలకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గ్రామ, పట్టణ సచివాలయాల్లో గ్రేడ్ 2 జేఎల్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న వారిని వెంటనే సచివాలయ ఉద్యోగులుగా గుర్తించి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మంజునాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. జేఎల్ఎం లు గ్రామ వార్డు సచివాలయ, విద్యుత్ అధికారుల మధ్య నలిగి పోతు, తీవ్రమైనటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారన్నారు. బయోమెట్రిక్ అంశంలో, విధుల అంశంలో ఎస్పీడీసీఎల్ అధికారులు జేఎల్ఎం లపై కర్ర పెత్తనం చేస్తున్నారని మండిపడ్డారు.

గ్రామాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం సేవలు



ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట మండలంలోని సూరప్పకశం గ్రామంలో సిపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిపాయి స్వేచ్ఛ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనకు ఆదర్శం అన్నారు. సిపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిపాయి భరోసా, సిపాయి విద్యా దీవెన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో 1250 మందికి న్యాప్‌కిన్లు, పలువురికి డ్రైఫ్రూట్స్ అందించారు. నెల్లూరు జిల్లా న్యాయమూర్తి సత్యవాణి, సర్పంచ్ శివారెడ్డి, వైసీపీ నాయకులు అరుణదేవి, ప్రముఖ న్యాయవాది తిరుమల రెడ్డి, సదాశివరెడ్డి, యువనేస్తం మునిశేఖర్, మాజీ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, వన్నెకుల క్షత్రియ సురేష్‌బాబు, గోవిందరెడ్డి, కేశవులురెడ్డి, వన్నెకుల జ్యోతి సుబ్రమణ్యంరెడ్డి, దశరథరెడ్డి, మూడు గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే వయోవృద్ధులకు ఆరోగ్యం



ప్రజాశక్తి- వరదయ్యపాలెం: పౌష్టికాహారం తీసుకుంటేనే వయోవృద్ధులకు ఆరోగ్యమని స్వచ్ఛత్ రూరల్ అర్బన్ డెవలప్ మెంట్ సొసైటీ అధ్యక్షులు, మావుడూరు మోహన్ అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో వరదయ్యపాలెం గ్రామ సచివాలయంలో వయోవృద్ధుల శరీర దృఢత్వం, పౌష్టిక ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రౌన్ రైస్, గుడ్లు, పాలు, విటమిన్ డి ఇచ్చే ఆహార ం తీసుకోవాలన్నారు. అంగనవాడీ వర్కర్ నారాయణమ్మ, పుష్పమ్మ పాల్గొన్నారు.

రేపు షాదీమంజిల్‌లో వైద్య సలహా శిబిరం

ప్రజాశక్తి-కోట : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఏప్రిల్ 11వ తేదీ మంగళవారం ఉదయంమాజీ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ నేతత్వంలో కోట పార్టీ ఆధ్వర్యంలో షాదీ మంజిల్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతుందని టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్ అన్నారు. కార్యక్రమాన్ని చుట్టుపక్కల గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక ఎన్జీవో కాలనీలోని చర్చిలో క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. పాస్టర్ సెల్వం, చిరంజీవి, ఐజాక్, విజయ్ కుమార్, జ్యోతి, మధు, జీవన్ బాబు, సంజీవి, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు.